ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY 5 జనగామ

మంగళవారం 17 సెప్టెంబరు 2024


నిమజ్జనోత్సవంలో వలంటీర్‌కు ఫిట్స్

లింగాలఘణపురం, సెప్టెంబరు 16: మండలంలోని నెల్లుట్ల చెరువు వద్ద జరుగుతున్న గణనాథుడి నిమజ్జనోత్సవంలో మహేశ్ అనే వలంటీర్ ఫిట్స్ సమస్య రావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అప్రమత్తమైన రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి అక్కడే సిద్ధంగా ఉన్న అంబులెన్స్ ద్వారా జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం మహేశ్ పరిస్థితి నిలకడగా ఉందని ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

గంగమ్మ ఒడికి గణేశుడు..



లింగాలఘణపురంలో వినాయక నిమజ్జనం



స్టేషన్ ఘన్‌పూర్‌లో నిమజ్జనానికి చెరువులోకి వినాయకుడిని తీసుకెళుతున్న సిబ్బంది

- కన్నుల పండువగా వినాయకుడి నిమజ్జనోత్సవం
- నెల్లుట్ల చెరువు వద్ద భారీగా ఏర్పాట్లు
- జిల్లా కేంద్రం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు
- భక్తి భావంతో పులకించిన పురవీధులు
- పర్యవేక్షించిన కలెక్టర్, డీసీపీ

జనగామ కల్చరల్/లింగాలఘణపురం, సెప్టెంబరు 16: భక్తుల తన్మయత్వం, యువత ఉత్సాహం, చిన్నారుల కేరింతలు, జిల్లా వాసుల జయ జయధ్వానాలతో గణేష్ నిమజ్జనోత్సవం సోమవారం జిల్లా వ్యాప్తంగా కన్నుల పండువగా జరిగింది. నవరాత్రుల పాటు పూజలందుకున్న గణనాథుడిని నృత్యాలు, కోలాటాల మధ్య ఊరేగింపుతో నిమజ్జనానికి తరలించారు. బ్యాండు మేళాలు, భాజా భజంత్రీలు, సంప్రదాయ నృత్యాలు వెరసి ఉండ్రాలయ్యను తల్లి గంగమ్మ ఒడికి సాగనంపాయి. గణపతి బొప్పా మోరియా ... ఆదా లడ్డూ చోరియా అంటూ భక్తులు హోరెత్తిన నినాదాలతో గణపయ్యకు ఘనమైన వీడ్కోలు పలికారు.

జనగామ జిల్లా కేంద్రం నుంచి వందలాది గణపయ్య విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అధికారులు లింగాలఘణపురం మండలం నెల్లుట్ల చెరువులో భారీ ఏర్పాట్లను చేపట్టారు. నిమజ్జనోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ దీపాల ఏర్పాటు, రెండు భారీ క్రేన్లు, రెండు బల్లకట్లు, 20 మంది గజ ఈతగాళ్లను, 200 మంది పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జిల్లా లోని మండలాల గణనాథులను ఆయా ప్రాంతాల సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆదేశాల మేరకు ఏసీపీ పార్థసారథిరెడ్డి, సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్‌ఐలు భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అనూహ్య ప్రమాదాలను నివారణకు 10 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా ఫైర్‌ఇంజన్లను, 108 అంబులెన్స్ వాహనాలను, వైద్యశిబిరాలను అధికారులు ఏర్పాటు చేశారు. జనగామ జిల్లా కేంద్రంతో పాటుగా లింగాలఘణపురం మండలానికి చెందిన పలు గ్రామాల నుంచి వినాయక విగ్రహాలు నెల్లుట్ల చెరువుకు సుమారుగా 400కు పైగా విగ్రహాలు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో రావడంతో నిమజ్జన స్థలి జనజాతరను తలపించింది.

వైభవంగా శోభాయాత్ర

జనగామ జిల్లా కేంద్రం నుంచి నెల్లుట్ల చెరువు వరకు గణనాథుడి శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు, డీసీఎంలు, మినీ ట్రక్కుల ద్వారా గణపయ్య విగ్రహాలను నెల్లుట్ల చెరువు వద్దకు తీసుకొచ్చారు. సాయంత్రం 7 గంటల నుంచి జిల్లా కేంద్రంలో మొదలైన శోభాయాత్ర నెల్లుట్ల ఫ్లైఓవర్ వరకు భక్తుల సందడితో కిటకిటలాడింది.



జనగామలో శోభాయాత్రలో భక్తుల కోలాట నృత్యాలు

స్వాగతం పలికిన వీహెచ్‌పీ ..

నిమజ్జనానికి తరలివచ్చే వినాయకులకు ఆర్టీసీ చౌరస్తా వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సూర్యాపేట రోడ్డులో ఏర్పాటు చేసిన వేదిక పై నుంచి వినాయక విగ్రహాల నిర్వాహకులకు స్వాగతం పలికారు. నిమజ్జనం సమయంలో పిల్లలను తీసుకెళ్లరాదని, జాగ్రత్తగా వాహనం నడుపుతూ నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని, నిమజ్జన కేంద్రం వద్ద సిబ్బంది సహాయం తీసుకోవాలని, వారి సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మంచాల రవీందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, ఉడుగుల రమేష్, గుణిగంటి రామకృష్ణ, లగిశెట్టి కిశోర్, రంగా నర్సింహారావు, దొంతుల శేఖర్, అభిషేక్, దొంతుల రాజేష్, విమల్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో విద్యార్థులు ..

గణేష్ నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులు చేసిన ఏర్పాట్లలో విద్యార్థులు పాలు పంచుకున్నారు. స్థానిక ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు అండగా నిలిచారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. నెల్లుట్ల చెరువు వద్ద భక్తులకు అవసరమైన సలహాలు సూచనలు అందించేందుకు అధికారులు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఎవరైనా భక్తులు అనూహ్యంగా అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యసేవలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపును ఏర్పాటు చేశారు.



వెల్దండలో నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



కూరగాయల మార్కెట్ రోడ్ నుంచి నిమజ్జనానికి సిద్ధమైన గణేశుడు

వీఐపీల తాకిడితో సందడిగా నెల్లుట్ల చెరువు..

నిమజ్జనోత్సవం సందర్భంగా నెల్లుట్ల చెరువు వీఐపీల తాకిడితో సోమవారం సందడిగా మారింది. నిజమజ్జనోత్సవాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారధి, ఆర్డీవో కొమురయ్య, మున్సిపల్ కమిషనర్, లింగాలఘణపురం తహసీల్దార్ వినయలత, ఎస్ఈ వేణుమాధవ్, డీఈ లక్ష్మినారాయణ, ఏడీఈ అనిల్‌కుమార్, రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడిని వాహనం నుంచి బయటకు తీస్తున్న క్రేన్



క్రేన్ సాయంతో వినాయకుడిని తీస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

ఘన్‌పూర్‌లో వినాయక నిమజ్జనాన్ని పరిశీలించిన డీసీపీ



ఘన్‌పూర్‌లో వినాయక నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 16: డివిజన్ కేంద్రంలోని వినాయక నిమజ్జనాలు నిర్వహిస్తున్న పుట్టలమ్మ చెరువు వద్ద నిర్వహణ ఏర్పాట్లను జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ సోమవారం రాత్రి 10గంటల సమయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద చేసిన ఏర్పాట్లను పంచాయతీ సెక్రటరీ చుక్క లింగయ్యను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ టీఎస్ఎస్పీడీసీఎల్ విద్యుత్ డీఈఈ గడ్డం గణేష్ వినాయక నిమజ్జనోత్సవంలో సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. గతంలో కంటే ఈసారి విద్యుత్ ఏర్పాట్లను తమ సిబ్బంది పకడ్బందీగా చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, ఏఈ చంద్రమోహన్, ఏఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు నీలం ఐలేష్, రాజేందర్, క్రిష్ణ, గబ్బెట సుధాకర్, సిబ్బంది గట్టు మంజుల, స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగించాలి

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16: వెట్టి చాకిరీ విముక్తి కోసం సాయుధ పోరాటం జరిగిందని, ఆ వారసత్వాన్ని కొనసాగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్ అన్నారు. జనగామ మండలం మరిగడిలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్థూపం ఆవిష్కరణ, సంస్మరణ సభ మండల కార్యదర్శి బోడ నరేందర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అబ్బాస్ హాజరై స్థూపాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ పల్లెలలో భూస్వాములు వేలాది ఎకరాల భూములను చెరబట్టి ప్రజలను కౌలు, లెవి, వెట్టిచాకిరి పేరుతో నిలువు దోపిడి చేస్తుంటే ప్రజలు భూస్వాముల అరాచకాలపై బందూకులు ఎక్కుపెట్టి పోరాడారన్నారు. సెప్టెంబరు 17న తెలంగాణ విమోన దినమని మతోన్మాద శక్తులు హడావుడి చేస్తున్నాయని, తెలంగాణ సామాజిక అణచివేత, ఆర్థిక దోపిడీ నుంచి ఎప్పుడు విమోచన జరిగిందో చూపించాలని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, శోభన్, కట్టా నర్సింహ, సాంబరాజు యాదగిరి, ఉపేందర్, జోగుప్రకాష్, సుంచు విజేందర్, బూడిద గోపి, బూక్య చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

నేడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. 9.45 గంటలకు డీసీపీ ఆగమనము, 9.50 గం.లకు కలెక్టర్ ఆగమనము, 9.55 గం.లకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వేదిక వద్దకు చేరుకుంటారని, 10 గం.లకు జాతీయ పతాకావిష్కరణ, 10.02 గం.లకు పోలీస్ గౌరవ వందనం స్వీకరణ, 10.05 గం.లకు ముఖ్య అతిథి సందేశము, 10.15 గం.లకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.30 గం.లకు జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.

క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించిన ఝాన్సీరెడ్డి




పాలకుర్తి క్యాంపు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, సెప్టెంబరు 16 : నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయంలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. త్వరలో మంచి రోజు చూసుకొని కార్యాలయంలో నుంచే అధికార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆమె వెంట తిరుపతిరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, జలగం కుమారస్వామి, చిలువేరు కృష్ణమూర్తి, యాకాంతరావు, పోగు శ్రీనివాస్, గద్దం యాకసోమయ్య, పెనుగొండ రమేష్, నిరంజన్‌రెడ్డి ఉన్నారు. అనంతరం ఇటీవల వావిలాల వద్ద ఆర్టీసీ బస్ ప్రమాదంలో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన ఎండి. నసిమా, అనారోగ్యంతో మృతి చెందిన అరూరి సోమయ్య మృతి చెందగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సందర్శించి పరామర్శించారు.

సాయుధ సంగ్రామం.. విముక్తి గీతం

"బండెనక బండికట్టి.. పదహారుబండ్లు కట్టి
ఏ బండ్లె పోతవు కొడుకో.. నైజాం సర్కరోడా..
చుట్టుముట్టూ సూర్యాపేట.. నట్టనడుమ నల్లగొండ
నువుండేది హైదరాబాద్.. దాని పక్క గోలుకొండ
గోలుకొండ ఖిలా కింద.. నీ ఘోరీ కడతం
కొడుకో.. నైనాము సర్కరోడా.."



అంటూ తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలనపై తిరగబడ్డారు. రజాకార్లు, పోలీసులు అణిచివేసినా.. భూస్వాములు, జమిందారులు, తాబేదార్లు ఆ నిజాం రాచరికానికి బాసటగా నిలిచినా.. బానిస బంధనాల నుంచి విముక్తి కోసం.. భూమికోసం, భుక్తికోసం కొట్లాడారు. ఓ వైపు జాతీయజెండాలు.. మరోవైపు ఆయుధాలు చేత బట్టిన ఎందరో యోధులు అవిశ్రాంత పోరాటం చేశారు. వారిలో కొందరు ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. అనేక మంది ప్రాణత్యాగాలు చేశారు. నాడు ఉవ్వెత్తున సాగిన విమోచన సాయుధ సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పాత్ర కీలకం.

- 'విమోచన' పోరాటంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా
- నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డిన యోధులెందరో
- నేడు తెలంగాణ విమోచన దినం

విమోచన ఉద్యమచరిత్రలో ఓరుగల్లు తనకంటూ ఒక పేజీని లిఖించుకుంది. ఈ పోరుబాటలో ఎందరో యోధుల గళం.. విముక్తి గీతంలా ప్రతిధ్వనించగా.. బైరాన్‌పల్లి, కూటిగల్, పరకాల తదితర గ్రామాల్లో రజాకార్లు చేసిన మారణకాండ విప్లవ స్ఫూర్తిని రగిల్చింది. చివరకు యోధులు, ప్రజల పోరాటానికి నిజాం సర్కారు తలవంచింది. 1948 సెప్టెంబరు 17న తెలంగాణకు విముక్తి లభించింది.

ప్రత్యేక కథనాలు 7వపేజీలో...

బతికుండగా నాలుగు మెతుకులు పెట్టండి..

- చనిపోయాక పిట్ట భోజనాలు పెట్టడం దండుగ
- బలగం ఫేమ్ కొమురయ్య (సుధాకర్ రెడ్డి)



బలగం ఫేమ్ కొమురయ్యతో పౌరాణిక పద్యనాటకం కళాకారులు, నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 16: కన్నవారు చనిపోయాక రకరకాల వంటకాలతో పిట్ట భోజనాలు పెట్టడం కంటే వారు బ్రతికున్న సమయంలో నాలుగు మెతుకులు పెట్టి వారి కంట కన్నీళ్లు రాకుండా చూసుకోవడమే గొప్ప విషయమని బలగం సినిమా ఫేం కొమురయ్య (సుధాకర్ రెడ్డి) తెలిపారు. ఆదివారం రాత్రి మండలంలోని మీదికొండ గ్రామంలో వేణుగోపాలస్వామి నాట్య కళామండలి ఆధ్వర్యంలో రామాయణంలో సీత ఘట్టం పైన పౌరానికి పద్య నాటకాన్ని నిర్వహించారు. పద్యనాటక ప్రదర్శన కార్యక్రమానికి బలగం సినిమా ఫేం కొమురయ్య, బహుబలి సినిమా ఫేం రేవంత్‌లు ముఖ్య అతిథులుగా హజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారుడు పొన్నం మొగిళిగౌడ్ ఇటీవల మృతి చెందగా ఆయన మరణం పట్ల మౌనం పాటించారు. ఈ సందర్భంగా బలగం కొమురయ్య మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు వచ్చాక పౌరాణిక నాటకాలను చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. పౌరానికి నాటకాలను నిర్వహించే కళాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే వారి విలువ తెలుస్తుందన్నారు. నేటి యువత బ్రేక్ డ్యాన్స్‌లు, డీజే డ్యాన్స్‌ల మోజులోపడి కళలను తక్కువగా చూస్తున్నారని తెలిపారు. పాశ్చాత్య సంస్కృతి పోకడలతో కళలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం కళాకారులు నాటక ప్రదర్శనతో అలరించారు. దశరథ మహరాజు, విశ్వామిత్రుడు, రాముడి వేషధారణతో కళాకారులు అద్భుతంగా ప్రదర్శనను ఇవ్వడంతో ప్రజలు సంతోషించారు. శ్రీసాయి సంతోషి నాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ లీలలు నాట్య ప్రదర్శనను కళాకారులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాట్యకళామండలి అధ్యక్షుడు అక్కనపల్లి రవీందర్, ప్రధానకార్యదర్శి చెరుకు పాపయ్య, సభ్యులు సోమయ్య, మల్లం రవీందర్, తాళ్లపల్లి యాదగిరి, మధు, మాజీ సర్పంచ్ నాగరబోయిన శ్రీరాములు, పసుల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వినూత్నం

ములుగు జిల్లా కన్నాయిగూడెంలో రాష్ట్రంలో మొట్టమొదటి కంటైనర్ పాఠశాల ఏర్పాటు



గతంలో పాఠశాలను నిర్వహించింది ఈ పాకలోనే..

ఏటూరునాగారం రూరల్/కన్నాయిగూడెం, సెప్టెంబరు 16: వినూత్న ప్రయోగానికి ఏజెన్సీ నిలయమైంది. ఏళ్ల తరబడి పూరి గుడిసెలో సాగిన చదువులకు గ్రహణం వీడింది. అటవీ పల్లెలో విద్యాబోధన కోసం ఓ కంటైనర్ సిద్ధమైంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కంతనపల్లి గ్రామ పంచాయతీ పరిధి మారుమూల అటవీ ప్రాంతంలోని బంగారుపల్లి గ్రామంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో శాశ్వత నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడం వల్ల కలెక్టర్ ఈ మేరకు చర్యలు చేపట్టారు. ఈ కంటైనర్ పాఠశాలను మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించనున్నారు.

ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయానికి 18 కిలోమీటర్ల దూరంలోని కన్నాయిగూడెం మండలం మండలం కంతనపల్లి సమీప అటవీ ప్రాం తానికి ఛత్తీస్‌గఢ్ నుంచి 2000లో గొత్తికోయలు వలస వచ్చి ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ప్రభు త్వం వీరి పిల్లల చదువుల కోసం 2010లో ఇక్కడ ఓపాకలో పాఠశాల ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ దానికి శాశ్వత నిర్మాణం జరగలేదు. పక్కా భవనం నిర్మించేందుకు అటవీ శాఖ అనుమతు లను నిరాకరిస్తోంది. దీంతో గొత్తికోయ పిల్లలు ఏళ్లతరబడి అదే పాకలో అష్టాకష్టాలు పడుతూ చదువుకుంటున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఇక్కడ విద్యాబోధన సాగుతోంది. మొత్తం 35 మంది పిల్లలు ఈ పాఠశాలలో చదువుకుం టున్నారు.

రాష్ట్రంలో మొట్టమొదటి కంటైనర్ పాఠశాల

పాఠశాల శాశ్వత నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో ఇక్కడ కంటైనర్ (ప్రీఫ్యాబ్రికేటెడ్ హౌజ్)ను ఏర్పాటు చేయాలని ములుగు కలెక్టర్ టీ.ఎస్.దివాకర్ నిర్ణయించారు. ఇందుకు రూ. 13 లక్షలు వెచ్చించారు. ఈనెల 11న పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపాదికన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పుడా పాఠశాల ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. మొత్తం ఐదు తరగతులకు 35 మంది విద్యార్థుల కోసం 12 డ్యూయెల్ డెస్కులు ఇందులో ఏర్పాటు చేశారు. అటవీ శాఖ అనుమతుల నిరాకరణ నేపథ్యంలో రెండు ననెలల క్రితం తాడ్వాయి మండలంలో మొట్టమొదటి కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేయగా, ఇప్పుడు అదే తరహాలో కన్నాయిగూడెం మండలం కంతనపల్లిలో పాఠశాలను ప్రారంభించనున్నారు. మంత్రి సీతక్క చేతుల మీదుగా మంగళవారం ఈ పాఠశాల ప్రారంభం కానుంది. దీనిపై గొత్తికోయవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది: పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రాచారి

ఈ పాఠశాలకు 2022లో ప్రధానోపాధ్యాయుడిగా చేరాను. అప్పటి నుంచి పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేశాను. కొని కారణాల వల్ల పాఠశాల భవనానికి పునాది పడలేదు. కానీ కలెక్టర్ చొరవతో ప్రీఫ్యాబ్రికెటెడ్ కంటైనర్ పాఠశాల సిద్ధం కావడం ఆనందంగా ఉంది. కంటైనర్ పాఠశాల నిర్మాణంతో విద్యార్థుల ఇక్కట్లు తీరనున్నాయి.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా కంటైనర్ పాఠశాల లోపలి దృశ్యం

బై..బై.. గణేశా..

వరంగల్ నగరంలో ప్రశాంతంగా జరిగిన వినాయక నిమజ్జనం



కాజీపేట బంధం చెరువులో క్రేన్ సహాయంతో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది


చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జన అవుతున్న గణపతులు


చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద సైకిల్ రిక్షాపై వెళుతూ..


చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద నిమజ్జనానికి కారుపై..


కాజీపేట బంధం చెరువు వద్ద బైక్‌పై వెళుతూ..




చిట్టి గణపతులను ఎత్తుకుని నిమజ్జనానికి తరలిస్తున్న యువతులు, చిన్నారి




వేయిస్తంభాల గుడి కోనేరులో నిమజ్జన దృశ్యం


వరంగల్ చిన్న వడ్డెపల్లి చెరువు వద్ద సిద్ధంగా ఉన్న రెస్క్యూ సిబ్బంది


ఆంధ్రజ్యోతి మడికొండ యూనిట్ ఆఫీసులో సిబ్బంది నిమజ్జన సంబురం


వరంగల్ చిన్న వడ్డెపల్లి చెరువులో నిమజ్జనంలో కలెక్టర్ సత్య శారద

సాయుధ సంగ్రామం.. విముక్తి గీతం..

'విమోచన' పోరాటంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా

హనుమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అగ్రభాగాన నిలిచింది. సాయుధ రజాకార్లు, నిజాం పోలీసుల అణిచివేసినా.. భూస్వామ్య జమిందారి వర్గం, తాబేదార్లు రాచరికానికి బాసటగా నిలిచినా.. ఎంతో మంది యోధులు ఎదురొడ్డారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. అనేక మంది ప్రాణత్యాగాలు కూడా చేశారు. ఆయుధాలు చేత బట్టి.. జైళ్లలో మగ్గారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ ఉద్యమంలో వరంగల్ జిల్లా పోరాటాల గడ్డగా నిలిచి.. విమోచన ఉద్యమ చరిత్రలో తనకంటూ ఒక పేజీని లిఖించుకుంది. కాకతీయులు ఏలినగడ్డపై రజాకార్లను ఎదురించిన వ్యక్తిగా బత్తిని మొగిలయ్య గౌడ్ నిలిచారు. అంతేకాదు బైరాన్‌పల్లి, కూటిగల్, పరకాల ఇలా ఎన్నో గ్రామాల్లో రజాకార్ల విధ్వంసకాండ నేటికీ గుర్తుండిపోయింది. ఈ నేపథ్యంలో రజాకార్ల అండతో చెలరేగిన దొరల దౌర్జన్యాన్ని ఎదురించిన చాకలి అయిలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకం చేసింది. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడిచేసి దాన్ని లేవనెత్తించారు. కడవెండి, అమ్మాపూర్, నాంచారిమడూరు తదితర ప్రాంతాల్లో సాగిన తెలంగాణ విమోచన ఉద్యమాలు ప్రజల స్వేచ్ఛా పిపాసకు నిలువెత్తు పతాకలు. నాడు నిజాంల అండతో రజాకార్లు విధ్వంసాలు, అకృత్యాలకు పాల్పడుతున్న వేళ ప్రజలు కొందరు పొరుగురాష్ట్రాలకు పారిపోయారు. మిగిలిన ప్రజల రక్షణ భారాన్ని ఉద్యమకారులు తీసుకున్నారు. నాడు పోరాట వ్యూహంలో భాగంగా ఉద్యమకారులు నైజాం స్టేట్‌లో కాక, ఇండియన్ యూనియన్ భూభాగాలైన చందా (మహారాష్ట్ర). గదక్ (కర్నాటక), విజయవాడ (ఆంధ్ర) మొదలైన ప్రాంతాల్లో సరిహద్దు శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సరిహద్దు శిబిరానికి ఒక్కొక్కరు నాయత్వం వహించారు. విజయవాడలోని శిబిరం హయగ్రీవాచారి నాయత్వంలో నడవగా ఉద్యమ ప్రచారానికి అవసరమైన పోస్టర్లు, కరపత్రాలను రాత్రివేళల్లో గ్రామాల్లో పంచేవారు. రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి మందుగుండు సామగ్రి వచ్చేది. ఈ విధ్వంస రచనను గమనించిన కేంద్ర ప్రభుత్వం రజాకార్ల అరాచకత్వం, విశృంఖలత్వం అంతమొందించాల్సిన అవసరం గుర్తించి 1948 సెప్టెంబరు 13న పోలీసు చర్యకు ఆదేశించింది. ఆ సమయంలో చేపట్టిన ఆపరేషన్ పోలో విజయవంతం కావడంలో వరంగల్ మామునూరు విమనాశ్రయం ఎంతగానో దోహదపడింది. విమానాల ద్వారా సైన్యం ఇక్కడికి చేరుకుని రజాకార్లను ఎక్కడికక్కడ అణిచివేసింది. ఇక దిక్కులేని స్థితిలో 1948 సెప్టెంబరు 17న నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ తలవంచడంతో నిజాం నిరంకుశ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించింది.

పరకాల మారణ హోమం

విమోచన సంగ్రామంలో పరకాల మారణ హోమం ఒక రక్తసిక్త ఘట్టం. జన జాగృతిలో భాగంగా 1947 సెప్టెంబరు 2న తాలూకాకేంద్రం అయిన పరకాల సమీపంలోని పైడిపెల్లి తాటివనంలో ఉద్యమనాయకులు సమావేశం నిర్వహించగా ప్రజలు భారీగా తరలివచ్చారు. కానీ అప్పటికే ఒకవైపు పోలీసులు, మరోవైపు రజాకార్లు మోహరించారు. ఉద్యమాన్ని విరమించుకోవలని పోలీసులు సూచించినా ప్రజలు వినలేదు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాలతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. దీన్ని అదనుగా చేసుకున్న రజాకార్లు కూడా తల్వార్లు, కత్తులు, బరిసెలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అనేక మంది ప్రాణాలు విడిచారు. ఎంతోమంది కాళ్లు, చేతులు తెగిపడ్డాయి. మాంసం ముద్దలు, రక్తపుటేరులతో ఆ ప్రదేశమంతా భయంకరంగా.. మరో జలియన్‌వాలా భాగ్‌ను తలపింపజేసింది.

బైరాన్‌పల్లి బీభత్సం

నిజాం సైన్యం బలగాలను, రజాకార్ల రాక్షసకృత్యాలను బైరాన్‌పల్లి గ్రామస్థులంతా ఐక్యతతో ఎదురించారు. ఈ పోరాటానికి ఇమ్మడి రాజిరెడ్డి, జగ్గం హనుమంతు, చల్లా నర్సిరెడ్డి, మోటాపోశాలు, తోటరాములు ఇమ్మడి రాంరెడ్డి తదితర యోధులు నాయకత్వం వహించారు. ఓ రోజున రజాకార్లు దూలిమిట్ల, లింగాపురం గ్రామాలను దోచుకొని సొమ్మునంతా బండ్లపై తరలిస్తుండగా బైరాన్‌పల్లి రక్షక దళం రజాకార్లను ఎదురించి తరిమికొట్టింది. దీంతో బిత్తరపోయిన రజాకార్లు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయారు. ఆ కక్షతో కూటిగల్ గ్రామంలో 20మందిని కాల్చి చంపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 12రోజులకే 1947 ఆగస్టు 27న అర్ధరాత్రి రజాకార్ల మూకలు బైరాన్‌పల్లిని చుట్టుముట్టి.. బైరాన్‌పల్లి బురుజుపై ఉన్న గస్తీదళ సభ్యులపై కాల్పులు జరిపారు. బురుజుపై ఉన్న పోరాటవీరులు తమ వద్ద ఉన్న మందుగుండు అయిపోయేంత వరకు సైన్యాన్ని నిలువరించగలిగారు. బురుజు వైపు నుంచి కాల్పులు ఆగిపోగానే సైన్యం బలగాలు గ్రామంలోకి ప్రవేశించి మారణహోమాన్ని సృష్టించాయి. పారిపోగా మిగిలిన 84 మందిని వరుసగా నిలబెట్టిన నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపారు రజాకార్లు. ఆ తదనంతర కాలంలో రజాకార్ల అండతో దొర సాగిస్తున్న దాష్టీకాలను చాకలి అయిలమ్మ ఎంతో ధైర్యంతో ఎదురించింది. దాడులను లెక్క చేయక మొక్కవోని ధీరత్వంతో పోరాటం సాగించి తన భూమిని కాపాడుకున్నది. ఐలమ్మ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని అనేకచోట్ల పోరాటయోధులు రజాకార్లకు వ్యతిరేకంగా దాడులు సాగించారు. తొర్రూరులో పోలీసుక్యాంపుపై దాడిచేసి దానిని లేవనెత్తించారు. కడవెండి అమ్మాపూర్, నాంచారిమడూర్‌కు చెందిన అనేక మంది పోరులో పాల్గొన్నారు. జఫర్‌గడ్‌లో, మధిర తాలూకా సిరిపురం గ్రామంలో రజాకార్లు సమరశీలురైన రైతులను కాల్చి చంపారు. 200 మంది రజాకార్లు వచ్చి అల్లీపురం గ్రామాన్ని తగులబెట్టారు. వీటికి ప్రతిగా పోరాటయోధులు ఆయా ప్రాంతాల్లో రజాకార్లపై ప్రతిదాడి జరిపి ప్రతీకారం తీర్చుకున్నారు.


పరకాలలోని అమరధామం

మొగిలయ్య వీరమరణం

రజాకార్ల దాష్టీకానికి పరాకాష్ఠగా నిలుస్తుంది బత్తిని మొగిలయ్య హత్యోదంతం. 1946లో తెలంగాణ విమోచనోద్యమం ఒక పక్క, భారత స్వాతంత్రోద్యమం మరో పక్క ముమ్మరంగా సాగుతున్న రోజులవి. వరంగల్ కోట నివాసి అయిన మొగిలయ్య మొదటి నుంచి విమోచనోద్యమంలో చురుకుగా పాల్గొనేవాడు. ఉద్యమంలో భాగంగా సర్వోదయ సంఘం పక్షాన ప్రతీవారం వరంగల్ కోటలో జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారు. 1946 ఆగస్టు 11న కోటలో జెండా ఎగరువేసిన తర్వాత కాశీంషరీఫ్ నాయత్వంలో రజాకార్లు హఠాత్తుగా దాడి చేశారు. రజాకార్లను ఎదరించే క్రమంలో మొగిలయ్య వారి కత్తిపోట్లకు గురై నేలకొరిగాడు.

రక్తమోడిన తమ్మడపల్లి(జి)

జఫర్‌గడ్, సెప్టెంబరు 16: తెలంగాణ సాయుధ పోరులో భాగంగా జఫర్‌గడ్‌ను కేంద్రంగా చేసుకుని నిజాం అనుచరుడైన రజాకార్ల నాయకుడు ఖాదరెల్లి చేస్తున్న దౌర్జన్యాలను అరికట్టేందుకు, రజాకార్లు, జాగీదారుల ఆగడాలను అడ్డుకునేందుకు ప్రజలు రక్షకదళాలను ఏర్పరచుకుని రాళ్లు, కర్రలు, వడిశాలలు, బర్సీలు, కత్తులు లాంటి సంప్రదాయ ఆయుధాలతో పోరుబాటలో నడిచారు. కమ్యూనిస్టు దళ నేతలు నల్ల నర్సింహులు, కృష్ణమూర్తి, యాదగిరిరావు, కూనూరు నెల్లుట్ల మోహన్‌రావు, పెండ్యాల రాఘవరావు, వంబాల రాఘవరావు, ఎలమంద, తదితరులు సంచరిస్తూ ఈ రక్షకదళాలు, ప్రజలు, రైతులను చైతన్యపరిచేవారు. సాయుధ పోరులో భాగం గా 1947, సెప్టెంబరు 11న జరిగిన ఆంధ్రమహాసభ తీర్మానాన్ని స్ఫూర్తిగా తీసుకుని జఫర్‌గడ్ ప్రాంతంలో రజాకార్ల ముఠాపై ప్రజలు, రైతులు తిరగబడి నిజాం, రజాకార్ల ప్రతినిధులను తరిమేశారు. దీంతో ఆగ్రహించిన ఖాదరెల్లి పోలీసులు, అనుచరులతో ప్రజలపై దాడులు చేయించాడు. కొద్దిరోజులకు మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామాన్ని చుట్టుముట్టి.. గ్రామానికి చెందిన 12 మందిపై గ్రామ కూడలిలో నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో చాడ అనంతరెడ్డి, బత్తిని బక్కరాజయ్య, దొంతూరి చినమల్లయ్య, ఎరుకలి ఇద్దయ్య, గుండెమల్ల పోశాలు, చెదలు నర్సయ్య, ఎండి.ఖాసీం, గుజ్జరి రామయ్య, దిడ్డి పెరుమయ్య, దుద్యాల చిన్న నర్సయ్య, గంద్రకుంట కోమటి నర్సింహరామయ్య, కుంట పెద్దాపురం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మంది గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ఘటనపై ప్రజలు ఆగ్రహావేశాలతో జఫర్‌గడ్‌లోని రజాకార్ల నేత ఖాదరెల్లి బంగ్లాపై దాడి చేసి, పశువుల కొట్టాన్ని, మొక్కజొన్న గూళ్లను దహనం చేశారు. పశువులను గ్రామస్థులకు పంపిణీ చేశారు.


జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జి)లో అమరుల స్మారక స్థూపం



ఆయుధం పట్టిన కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి (అచ్చమాంబ)

ఆయుధం పట్టిన అచ్చమాంబ

జఫర్‌గడ్ మండలం కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి అచ్చమాంబ పేరుతో భర్త నెల్లుట్ల మోహన్‌రావుతో కలిసి సాయుధ పోరాటంలో ఆయుధం పట్టి నిజాం, రజాకార్లు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన అచ్చమాంబ 14ఏళ్ల వయసులోనే నిజాం, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంగా ఉద్యమంలో కూనూరుకు చెందిన దళ నేత నెల్లుట్ల మోహన్‌రావుతో ఏర్పడిన పరిచయంతో వివాహం చేసుకున్నారు. పోరాటంలో గాయపడిన కార్యకర్తలకు వైద్యం చేస్తూ.. మరోవైపు ఆమె మహిళలను చైతన్యవంతం చేస్తూ దళనాయకులతో కలిసి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం. ప్రస్తుతం భర్త చనిపోగా సుశీలాదేవి ప్రస్తుతం వరంగల్‌లో కుమార్తె వద్ద ఉంటున్నారు.

ఆగడాలకు ప్రత్యక్ష సాక్షి..


84ఏళ్లయినా చెక్కుచెదరని విస్నూరు గడి


విస్నూరు గడి ఇదే..

పాలకుర్తి, సెప్టెంబరు 16 : నిజాం నవాబుకు ప్రధాన అనుచరుడైన విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి తన కోసం ఓ గడీని నిర్మించుకున్నారు. ఆ గడి పేరు చెబితే చాలు ఈ ప్రాంత వాసులు గడ గడలాడే వారు. నాడు సుమారు 60 గ్రామాల ప్రజలతో వెట్టి చాకిరీ చేయించి ఈ గడిని నిర్మించారు. ఇది జరిగి 84 ఏళ్లయినా ఆ గడీ ఇంకా చెక్కు చెదరకుండా నూతన భవనంలా ఉంది. కానీ నిజాం, దేశ్‌ముఖ్, రజాకార్ల ఆగడాలు, దమన కాండకు, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చేసిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీలు విస్నూరు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా ఎదురొడ్డి చేసిన పోరాటాలకు ఈ గడీ ప్రత్యక్షసాక్షిగా నిలిచింది.

నెహ్రూ ఇంటి తరహాలోనే నిర్మాణం

అలహాబాద్‌లోని అప్పటి ప్రధాని నెహ్రూ ఇంటి నిర్మాణం తర్వాత మరెక్కడా లేని విధంగా ఈ భవనం అధునాతన పరిజ్ఞానంతో నిర్మించారు. గడి నిర్మాణాన్ని 1940లో ప్రారంభించి 1943లో పూర్తి చేశారు. విస్నూరు చుట్టూ ఉన్న 60 గ్రామాల ప్రజల నుంచి రజాకార్లను పంపించి బలవంతంగా వసూళ్లు చేసిన రూ.2లక్షలను ఈ గడి కోసం ఖర్చు చేశారు. ఐదున్నరక ఎకరాల్లో బ్రిటీష్ సివిల్ ఇంజనీరు ప్లాన్‌తోనే నిర్మాణం జరగ్గా.. అప్పటి కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి వల్లూరి బసవరాజు పర్యవేక్షణలో ఈ నిర్మాణం పూర్తి చేశారు. 20 గజాలలోతు, 3గజాల వెడల్పుతో పునాదులు తవ్వి అప్పుడు ఊరిన నీటిని ఆయిల్ ఇంజన్‌లతో బయటికి తోడించి సున్నం, కంకరను పునాదుల్లో పోసి దిమ్మిసలతో అదిమి, పకడ్బందీగా నిర్మించారు. 2 గజాల వెడల్పు, 5 గజాల లోతులో ఐదున్నర ఎకరాల్లో ప్రహరీ నిర్మించారు. రంగూన్ నుంచి బర్మా టేకును, స్విడ్జర్లాండ్ నుంచి జర్మన్ టెక్నాలజీ విద్యుత్ స్విచ్ బోర్డులు తెప్పించారు. ఇక మరుగుదొడ్ల నీరు బయటకు వెళ్లేందుకు 2 కిలోమీటర్ల దూరం అండర్ గ్రౌండ్ కాలువను నిర్మించారు. తుపాకుల తూటాలు గోడలోకి దూసుకుపోకుండా సీసం, పాచి తీగ, కోడిగుడ్లను దంగు సున్నంలో కలిపి గడి గోడలు కట్టారు. 1943లో గృహప్రవేశ కార్యక్రమం జరగ్గా నిజాంనవాబు హాజరై దేశ్‌ముఖ్‌కు ధనరాశులను బహుమతిగా అందించారు. అలాగే విస్నూరులో దేశ్‌ముఖ్‌కు రక్షణగా 1937లో తొలి పోలీస్ ఠాణాను నిర్మించగా.. రెండోది రంగారెడ్డి జిల్లాలో నిర్మించారు. 84 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మున్నూరు గడి చెక్కు చెదరకుండా నూతన భవనంలా ఉంది.


విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి (ఫైల్)

'కాటారం' వీరులెందరో..

కాటారం, సెప్టెంబరు 16: తెలంగాణ విముక్తి పోరులో భూపాలపల్లి జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ (పూర్వ కరీంనగర్‌జిల్లా) వాసులెందరో వీరోచితంగా పోరాడారు. దామెరకుంట, మహదేవపూర్, మంథని ప్రాంతాలకు చెందిన యోధులు త్యాగాలు చేశారు. ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు నాయకత్వం వహించగా, రఘునాథ్‌కాచే జిల్లాలో తొలి సత్యాగ్రహవాదిగా కీలక భూమిక పోషించారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు నేతృత్వంలో దామెరకుంట, మహదేవ్‌పూర్, మంథనికి చెందిన వెంకటయ్య, చిన్న పోచిరెడ్డి, కొడిపెల్లి వెంకటయ్య, బక్క రాజయ్య, రాజిరెడ్డి, కిషన్‌రావు, ప్రభాకర్, చంటయ్య, రాజన్న, రాంపెల్లి కిష్టయ్య, దామోదర్, శివనాద్రి శంకరయ్య, నరహరి, సీతారాం తదితరులు సాయుధ పోరాటం చేశారు. స్వామి రామానందతీర్థ పిలుపుతో సత్యాగ్రహ ఉద్యమంలో రఘునాథ్ కాచే ఆధ్వర్యంలో గణపతి, రాజేశ్వర్‌రావు, రాజన్నచారి సహా పలువురు పాల్గొని నిజాంకు వ్యతిరేకంగా పోరాడి కరీంనగర్, నిజామాబాద్ జైళ్లలో శిక్షను అనుభవించారు. దామెరకుంటకు చెందిన ఐత చిన్నపోచిరెడ్డిని రజాకార్ల సైన్యం ధన్వాడ వద్ద చంపడం విషాదాన్ని నింపింది. శ్రీరాములు బృందం మహారాష్ట్రలోని చంద్రాపూర్(చాందా)లో సాయుధ శిక్షణ పొంది, గడ్చిరోలి జిల్లా సిరొంచ కేంద్రంగా క్యాంపును ఏర్పాటు చేసుకుంది. అజ్ఞాతంలో ఉంటూ మంథని, మహదేవపూర్ తాలూకాల్లో నిజాం పోలీసు అధికారులపై గెరిల్లా దాడులు చేశారు. 1948లో గోదావరినది దాటి నిజాం సర్కార్ దామెరకుంట, కాళేశ్వరం, మహదేవపూర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్లపై దాడి చేశారు. దామెరకుంటలో కలెక్టర్ పర్యటన సందర్భంగా తహసీల్ అధికారులపై దాడి చేసి చంపిన సంఘటన సంచలనం రేపింది. ఈ దాడుల స్ఫూర్తితో ఈ ప్రాంతాల్లో ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించారు.


సిల్వర్ జూబ్లీ స్వాతంత్ర్యానికి గుర్తుగా ఏర్పాటు చేసిన స్థూపం

ఎందరో యోధుల స్ఫూర్తి

బందగీ పోరాటం చిరస్మరణీయం


కామారెడ్డిగూడెంలోని షేక్‌బందగీ సమాధి

దేవరుప్పుల, సెప్టెంబరు 16: నాటి నల్లగొండ జిల్లా జనగామ ప్రాంత విస్నూరు దేశ్‌ముఖ్ అయిన రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలు, అకృత్యాలకు ఎదురొడ్డి పోరాడిన దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య తొలి వీర మరణం పొంది చరిత్రకెక్కాడు. అంతేకాదు దేవరుప్పుల, ధర్మాపురం, కోలుకొండ, కడవెండి గ్రామాల్లోనే దాదాపు 40మంది విస్నూర్ దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా, నైజాం విముక్తిపోరులో పోరుసల్పి అసువులు బాశారు. గుండెనె ఉద్యమ జెండాగా చేసి పోరాడిన వారిలో దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంకు చెందిన షేక్‌బందగీ ఒకరు. విస్నూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి ఆధీనంలో ఉన్న గ్రామాల్లో ఆయన చెప్పిందే వేదం. షేక్‌బందగీ అన్న అబ్బాస్‌అలీ విస్నూర్ దేశ్‌ముఖ్‌కు ముఖ్య అనుచరుడు. అన్నదమ్ముల మధ్య భూ వివాదం ఏర్పడగా.. అబ్బాస్‌అలీకి ఎక్కువ భూమి ఇవ్వాలని విస్నూరు దొర తీర్పుచెప్పారు. దానిని అంగీకరిచని బందగీ వాగ్వాదానికి దిగడంతో దొర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయినా తగ్గని బందగీ కోర్టుకు వెళ్లాడు. ఆ సమయంలో దొర ఎన్ని ప్రయత్నాలు చేసినా బందగీనే విజయం సాధించాడు. ఇలా పదేళ్లపాటు బందగీ చేసిన పోరాటం.. ఈ ప్రాంతంలో ఎంతో మందికి ధైర్యానిచ్చింది. కానీ బందగీపై కోపం పెంచుకున్న విస్నూరు దొర.. కోర్టు తీర్పు వచ్చిన ఆనందంతో ఉన్న బందగీ ఒక్కడే సూర్యాపేటకు వెళ్లే సమయంలో అతడి అన్న అబ్బాస్‌అలీని రెచ్చగొట్టి దాడి చేయించి తల నరికారు. అలా బందగీ ధైర్య సాహసాలను మరిచిపోలేని ప్రజలు కామారెడ్డిగూడెం స్టేజీ వద్ద బందగీ సమాధి కట్టారు. బందగీ స్ఫూర్తిని ఎంచుకొని 1944లో భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభకు యోధులు భారీగా తరలొచ్చారు. ఎక్కడ నలుగురు కలిసినా బందగీ ఉదంతమే చర్చకొచ్చేది.


కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారక భవనం

శోభాయమానంగా వినాయక నిమజ్జనం


జఫర్‌గడ్‌లో నిమజ్జనానికి తీసుకువెళుతున్న పద్మశాలీ కులస్తులు


కొడకండ్లలో లడ్డును వేలంపాటలో సొంతం చేసుకున్న సురేష్, యాకూబ్‌లు


తరిగొప్పులలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

బచ్చన్నపేట, సెప్టెంబరు 16: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సోమవారం గణేశుడి నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. కోలాటాలు, నృత్యాలు చేస్తూ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కట్కూరులో కేడీవైఎం యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఘటనలు జరగకుండా ఎస్‌ఐ సతీష్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.

● నర్మెట : తొమ్మిది రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వాడవాడలా వైభవంగా నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో చివరి రోజు గణపతి మండపాల వద్ద అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలో ఎల్లమ్మ బజార్, వేంకటేశ్వరస్వామి దేవాలయం, హనుమాన్ దేవాలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుల మండపాల నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేసి వినాయకులను వీధివీధిన ఊరేగించి చెరువు వద్దకు తరలించి నిమజ్జనం చేశారు. వెల్దండ గ్రామంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాన్ని భజన కార్యక్రమాలు చేసుకుంటూ చెరువులో నిమజ్జనం చేశారు. చెరువుల వద్ద నర్మెట ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో చెరువుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

● తరిగొప్పుల : మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని గణేష్ మండపాల్లో నవరాత్రులు భక్తులతో పూజలందుకున్న గణనాథుల నిమజ్జనం సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పలు యూత్ అసోషియేషన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను సోమవారం సాయంత్రంలో వేళల్లో గ్రామ వీదులలో ఊరేగించి నిమజ్జనం చేశారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో గణపతి నిమజ్జోనత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వినాయకుడికి పలు చోట్ల ప్రత్యేక పూజలు ఆచరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. అన్నదానం అనంతరం గణపతి లడ్డూ, హారాలు వేలం వేశారు. వాటిని భక్తులు పోటీ పడి కొనుగోలు చేశారు. శివునిపల్లి పట్టణ నగరేశ్వరాలయంలో, బరోడా బ్యాంకు, శ్రీ వేంకటేశ్వరాలయం వద్ద గణేష్ లడ్డూ వేలంలో గౌరిశెట్టి శ్రీనివాస్ అనే వ్యాపారి రూ.21116లకు దక్కించుకున్నారు. అలాగే స్వామి వారి మెడలోని దండలను గన్ను శ్రీనివాస్ రూ.1216లకు, పి.కృష్ణమూర్తి రూ.2116లకు, ఆర్.శ్రీనివాస్ రూ.1516లకు, బి.సతీష్ రూ.1116లకు, జొన్నల రాజేశ్వర్ రూ.1121లకు, పాలకుర్తి సోమశేఖర్ రూ.1016లకు, సంతోష్ రూ.1116లకు, ఎం.హరినాథ్ రూ.1116లకు, కొంతం శ్రీను రూ.1116లకు దక్కించుకున్నారు.గణపతి విగ్రహాలను స్టేషన్ ఘన్‌పూర్ పుట్టలమ్మ చెరువు వరకు ఘన్‌పూర్, శివునిపల్లితో పాటు పలు గ్రామాల నుంచి వినాయకుని విగ్రహాలను మేళతాళాలు, నృత్యాలతో శోభాయాత్ర చేపట్టి భక్తులు గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. చెరువు కట్టల వద్ద ఏర్పాట్లను ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఈఓ లింగయ్య పర్యవేక్షించారు.

● జఫర్‌గడ్ : శ్రీవినాయక నిమజ్జనోత్సవం సోమవారం మండలంలో భక్తిశ్రద్ధలతో శోభాయమానంగా జరిగింది. జఫర్‌గడ్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో నవరాత్రులు పూజలందుకున్న గణనాథులను భక్తజనులు జలాశయాల్లో నిమజ్జనం చేశారు. స్థానిక హనుమాన్ సెంటర్‌తో పాటు ముదిరాజ్, పద్మశాలి, గౌడ, ఆర్యవైశ్య, తదితర కుల సంఘాలు, యువజన, స్వచ్ఛంధ ఉత్సవ కమిటీలచే ప్రతిష్ఠించబడిన గణపతి ప్రతిమలను అలకంరించిన వివిధ వాహనాలపై నిమజ్జనం చేసేందుకు తీసుకువచ్చారు. రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

● పాలకుర్తి : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో భాగంగా లడ్డూ వేలం పాటలు, గణనాథుల ఊరేగింపు వేడుకలు కోలాహలంగా జరిగాయి. తొమ్మి ది రోజు నిర్విఘ్నంగా పూజలు అందుకున్న గణనాథులు భక్తుల సందడి, నృత్యాల నడుమగంగమ్మ ఒడికి చేరారు. పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బ్యాండ్, మోతలు, డీజేల సౌండ్‌తో నృత్యాల నడుమ వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లలు, పెద్దలు, యువకులు కాషాయ రిబ్బన్లు ధరించి నిమజ్జనం శోభాయాత్రలో పాల్గొన్నారు. పాలకుర్తిలో కోనమ్మ కుంటలో వినాయకులను నిమజ్జనం చేయించారు. ఎలాంటి ఘటనలు జరుగకుండా తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయిప్రసన్న కుమార్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : గణేష్ నవరాత్రి వేడుకల్లో భాగంగా వినాయక నిమజ్జన ఘట్టం సోమవారం నిర్వహించారు. వినాయక విగ్రహాలను డివిజన్ కేంద్రంలోని పుట్టలమ్మ చెరువు వద్దకు తీసుకువచ్చి నిమజ్జనంను నిర్వహించారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మందపురం ఎల్లాగౌడ్-కవితల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయ విగ్రహాల నిమజ్జనాలకు అన్ని విధాల ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్డీవో వెంకన్న తెలిపారు. సోమవారం డివిజన్ కేంద్రంలో వినాయక నిమజ్జనాలు జరిగే పుట్టలమ్మ చెరువు కట్టపైన సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏసీపీ భీమ్‌శర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐలు జి.వేణు, గురుస్వామి, ఆర్ఐ రవీందర్, వాసవి క్లబ్ మాజీ డిప్యూటీ గవర్నర్ తెల్లాకుల రామకృష్ణ, సెక్రటరీ లింగయ్య, సిబ్బంది మంజుల, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

●రఘునాథపల్లి : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని గణేష్ మండపాల వద్ద సోమవారం ప్రత్యేక పూజలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగాయి. మండల కేంద్రంలోని వాసవీ భవన్‌లో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కూరెల్లి పెద్దఉపేందర్, పడకంటీ రవీందర్, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నార మండల కేంద్రంలోని వివిధ వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, గాదె మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● దేవరుప్పుల : మండలకేంద్రమైన దేవరుప్పుల వాగులో సోమవారం జరుగు వినాయక నిమజ్జనం ఏర్పాట్లను వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర స్థలంలోకి వెళ్లవద్దని కోరరు. కార్యక్రమంలో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.ష్, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : మండలవ్యాప్తంగా గణేశ్ నిమజ్జన వేడుకలను భక్తులు సోమవారం ప్రశాంతంగా ముగించారు. నవరాత్రులు భక్తులచే పూజలందుకున్న గణేశుడు తల్లి ఒడిని చేరుకున్నాడు. మండలంలోని రామన్నగూడెం సర్పంచ్ తండాలో యువ బంజారా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండపం వద్ద లడ్డును కున్సోత్ సురేష్, యాకూబ్ నాయక్‌లు కలిసి లక్ష ఇరవై వేల నూటా పదహారు రూపాయ లకు దక్కించుకోవడం ప్రత్యేకతగా నిలిచింది, మండలకేంద్రంలోని జుబ్లీహిల్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పూజలందుకున్న మట్టి వినాయకుడు పూజలందు కున్నాడు. యువకులు మేళ తాళాల మధ్య కోలాటాల మధ్య గణపతి విగ్రహాలను సాగనంపారు.


స్టేషన్ ఘన్‌పూర్‌లో ముగింపు రోజు పూజలు చేస్తున్న భక్తులు


వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్న టీఎస్ఎన్పీడీసీఎల్ డీఈఈ


పాలకుర్తిలో గణపతిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు


రఘునాథపల్లిలో అన్నప్రసాద వితరణ చేపట్టిన నాయకులు


బచ్చన్నపేటలో నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

పీడీఎస్ బియ్యం పట్టివేత

దేవరుప్పుల, సెప్టెంబరు 16: మండలంలోని సీత్యతండాకు చెందిన గుగులోతు యాకు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 3.50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం దేవరుప్పుల పోలీసులు పట్టుకున్నారు. యాకూపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రవణ్‌కుమార్ వెల్లడించారు. అదే విధంగా డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే నష్టానికి సంబంధించిన స్టిక్కర్లను వాహనాలకు అంటించారు. రేషన్ బియ్యం ఎవరూ కొనవద్దని, కొని విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

● చిలుపూర్ : నిబంధనలకు విరుద్ధంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టగూడెం, తుర్కపల్లి గ్రామాలకు చెందిన భూక్య గణేశ్, భూక్య శేఖర్, మాలోత్ నరేష్‌లు మండలంలోని ఆయా గ్రామాల్లో 10 క్వింటాళ్ళ బియ్యాన్ని సేకరించి బొలెరో ట్రాలీ వాహనంలో తరలిస్తుండగా, విశ్వసనీయ సమాచారం మేరకు వెంకటాద్రిపేట వద్ద పట్టుకున్నట్లు, బియ్యం విలువ రూ 26 వేలు ఉంటుందని స్పష్టం చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్, పోలీసు సిబ్బంది వీరన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డెడ్‌ఫ్రీజర్‌కు ఆర్థిక సాయం

లింగాలఘణపురం, సెప్టెంబరు 16: మండలంలోని నెల్లుట్ల గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబాల విజ్ఞప్తి మేరకు డెడ్ బాడీ ఫ్రీజర్ కోసం స్థానిక తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి రూ. 70వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. స్థానిక ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో పునర్నిర్మాణం చేసిన మజీద్‌ను ప్రారంభించారు. అనంతరం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు కొల్లూరు శివకుమార్, బత్తిని అశోక్, లొక్కుంట్ల ప్రవీణ్, దామెర నాగరాజు, గాడిపెల్లి శ్రీనివాస్, ఫక్రుద్దీన్, రహమాన్, షరీఫ్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవాలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16: జనగామ ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ 46వ ఆవిర్భావ దినోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో జరిగిన కార్యక్రమంలో డిపో సెక్రటరీ ఎనగందుల సతీష్ పతాకావిష్కరణ చేశారు. ఎలికట్టె యాదగిరి, తుమ్మ సంతోష్, విజయేందర్, రాజు పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16: జిల్లా కేంద్రంలోని బాణాపురం అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7.15 గంటలకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూల విరాట్టుకు పంచామృత అభిషేకములు, అలంకరణ మహోత్సవం నిర్వహించబడుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి దివ్యదర్శనం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి స్వచ్ఛతాహీ సేవ

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16: జనగామ మునిసిపాలిటీలో స్వచ్ఛతాహీ సేవ - 2024 కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సంబంధిత సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టే కార్యక్రమాలు ఈ విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ మహిపాల్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపయ్య, మేనేజర్ జి.రాములు, వార్డు అధికారులు, సానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

పక్షోత్సవాల సభను జయప్రదం చేయాలి

బచ్చన్నపేట, సెప్టెంబరు 16: ఈ నెల 17న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నాయకులు మినలాపురం ఎల్లయ్య, సమ్మయ్య, బుచ్చిరెడ్డి, కనకయ్య, పాషా, రాములు, సిద్దిరాములు, వెంకటయ్య, లింగం పాల్గొన్నారు.

నేడు సీపీఎం బహిరంగ సభ

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 17న జనగామలోని ధర్మ దామోదర్‌రెడ్డి గ్రౌండ్ గెస్ట్‌హౌస్ వద్ద బహిరంగ సభ ఉంటుందని, ముందుగా మధ్యాహ్నం 12 గంటలకు జనగామ బస్టాండు నుంచి గెస్ట్‌హౌస్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సికార్ ఎంపీ అమరారం ముఖ్య అతిథిగా హాజరవుతారని, జిల్లాలోని పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు.

గ్రంథాలయానికి మరమ్మతులు చేపట్టాలి

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16: శిధిలమైన జిల్లా గ్రంథాలయ భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజశేఖర్‌రెడ్డి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు లేఖ రాశారు. ఇటీవల గ్రంథాలయం పెచ్చులూడి విద్యార్థులు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్న ఉదంతంతో స్పందించిన ఎమ్మెల్యే సోమవారం కలెక్టర్‌కు లేఖ ద్వారా విన్నవించారు. 1963లో నిర్మించిన గ్రంథాలయ భవనం పూర్తిగా శిధిలావస్థకు చేరుకుందని, ఎందరో పాఠకులకు, విద్యార్థులకు ఉపయోగపడుతున్న గ్రంథాలయ భవనానికి మరమ్మతులు చేపట్టాలని లేఖ ద్వారా కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, సెప్టెంబరు 16 : మండలంలోని గూడూరు గ్రామ శివారులోని జానకిపురానికి చెందిన మునిగె నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గూడూరుకు చెందిన చుక్క రామయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు మాచెర్ల పుల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం రూ. 5 వేలు, బియ్యం అందజేశారు. ఆయన వెంట లింగంపెల్లి రామస్వామి, బెల్లి సంపత్, మంద సతీష్, మునిగె నరేష్, రాంచందర్ ఉన్నారు.

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు


ఆకుల శ్రీనివాసరావు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16: జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఆకుల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన 5వ రాష్ట్ర మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. జనగామ జిల్లాలో సైన్స్ ప్రచారంలో ముందుండి ప్రతి సంవత్సరం నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహణ, 2020లో జరిగిన రాష్ట్ర ప్లీనం విజయవంతం చేయడంలో, అదే విధంగా 2024లో జనగామలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాల విజయవంతానికి కీలకంగా కృషి చేసినందుకుగాను రాష్ట్ర శాఖ గుర్తించి రాష్ట్ర శాఖ ఎన్నిక చేసినట్లు జేవీవీ జిల్లా అధ్యక్షులు బి.రవీందర్ పేర్కొన్నారు. కాగా ఆకుల ఎన్నిక పట్ల జేవీవీ జిల్లా నాయకులు మర్రెడ్డి, చంద్రశేఖర్‌రావు, కనకయ్య, లక్ష్మణ్‌జీ, బాలరాజు, సత్యప్రకాష్, శ్రీనివాస్, సత్తయ్య, శ్రీహరి, నర్సింహారావు, శ్రీనివాసచారి హర్షం వ్యక్తం చేశారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

లింగాలఘణపురం, సెప్టెంబరు 16: మండలంలోని నెల్లుట్లకు చెందిన బోనాల కోలాటం కళాకారిని బండి రాములమ్మ ఆదివారం మృతిచెందగా సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య నెల్లుట్లకు చేరుకుని పార్థివదేహంపై పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నల్ల రాహుల్ తదితరులున్నారు.

సోమనర్సింహాచారికి సన్మానం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16: విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర అవార్డు గ్రహీత అయిలా సోమనర్సింహాచారిని ఘనంగా సన్మానించారు. సోమవారం హైద్రాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పెంబర్తి హస్తకళాకారుడు అయిలా సోమనర్సింహాచారి జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షులు అడ్డూరి రవీంద్రచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర బీజేపీ విశ్వకర్మ సెల్ ప్రతినిధులు జలంధ రాచారి, కౌలె జగన్నాథం, పట్నాల సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి స్థల పరిశీలన..

తరిగొప్పుల, సెప్టెంబరు 16: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజర్సింహ్మ, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు రెవెన్యూ అధికారులు సోమవారం అనువైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుజ్జ రవీందర్, సర్వేయర్ శ్రీనివాస్‌తో కలిసి మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించి తహసీల్దార్‌కు నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పండుగ కనకయ్య, దామెర లూక, పింగిళి ఇంద్రారెడ్డి, కొయ్యడ రాజు గౌడ్, సుంకరి అనిల్, మంద చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


వినూత్న తరహాలో వినాయకుడి లడ్డు దక్కించుకున్న 'వికాస్'

రఘునాథపల్లి,సెప్టెంబరు 16: మండల కేంద్రంలోని మిత్ర సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద లడ్డు కోసం వేలం పాట నిర్వహించకుండా వినూత్న తరహాలో సోమవారం నిర్వహించిన డ్రా పద్ధతిలో మండల కేంద్రానికి చెందిన గుండ వికాస్ లడ్డును దక్కించుకున్నాడు. వినాయకుడి లడ్డును దక్కించుకోవడానికి గతంలో వేలంపాట నిర్వహించే వారు. వేలం పాటలో అధిక మొత్తం పాట పడిన వారికే వినాయకుడి లడ్డు దక్కేది. దీంతో వినాయకుడి లడ్డు పొందడానికి అధిక మొత్తంలో వేలం పాట పాడడానికి డబ్బులే ప్రామాణికం కావడంతో సామాన్యులకు లడ్డు అందని ద్రాక్షగానే మిగిలిపోయేది. దీంతో నిర్వాహక కమిటీ సభ్యులు ఈ సారి రూ.100 రుసుం పద్ధతిన డబ్బులు వసూలు చేసి డ్రా పద్ధతిన వినాయకుడి లడ్డును అందించాలనే లక్ష్యంతో వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టారు. డ్రాలో లడ్డు పొందడానికి 64 మంది రూ.100 రుసుము చెల్లించారు. డ్రా పద్ధతి ద్వారా 64 మందిలో గుండ వికాస్ వినాయకుడి లడ్డును దక్కించుకోవడం విశేషం. దీంతో గత కొన్నే ళ్లుగా డబ్బులు లేకపోవడంతో వినాయకుడి లడ్డును దక్కించు కోలేకపోయిన సామాన్యుడి కల నెరవేరి సాకారమయినట్లయిందని పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

ఎన్‌ఆర్ఈజీఎస్‌లో జరిగిన తప్పిదాలకు జరిమానాలు తప్పవు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 16: ఎన్‌ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పనుల్లో భాగంగా గ్రామాల వారీగా జరిగిన తప్పిదాలకు జరిమనాలు విధించడం తప్పదని ఎంపీడీవో విజయశ్రీ తెలిపారు. సోమవారం ఘన్‌పూర్ జీపీ కార్యాలయం ఆవరణలో జరిగిన ఎన్‌ఆర్ఈజీఎస్ గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. మండలంలోని చంద్రుతండ, తానేధార్‌పల్లి, సముద్రాల గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో డీఆర్‌పీలు, సెక్రటరీలు పాల్గొన్నారు. డివిజన్ కేంద్రంలోని గ్రామసభలో ఎంపీడీవో మాట్లాడారు. గత ఏడాది 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు ఎన్‌ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా గ్రామాల వారిగా చేబట్టిన ఉపాధిహామీ పనుల పై ఈ నెల 7 వరకు ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ, వీఆర్‌పీల ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఉపాధిహామీ పథకంలో దొర్లిన తప్పిదాలకు ఈ నెల 18న ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగే సమావేశంలో డీఆర్‌డీవో పీడీ జరిమానాలు విదిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌పీ శివకుమార్, ఈవో చుక్క లింగయ్య, సెక్రటరీలు ఎదునూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం


సబ్సిడీ ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న ఉమ్లానాయక్

చిలుపూర్, సెప్టెంబరు 16 : పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని పీఏసీఎస్ డైరెక్టర్ గుగులోత్ ఉమ్లానాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని ఫతేపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వంట గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అర్హులైన లబ్దిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హరిప్రసాద్, మాజీ సర్పంచ్ రూప్లానాయక్, రేషన్‌డీలర్ ప్రతాప్‌సింగ్, బాలూనాయక్, భిక్షపతి పాల్గొన్నారు.

గణేష్ యూత్ ఆధ్వర్యంలో విద్యాశక్తి


వెల్దండలో వ్యాసరచన పోటీలు రాస్తున్న విద్యార్థులు

నర్మెట, సెప్టెంబరు 16 : మండలంలోని వెల్దండ గ్రామంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి విద్యార్థులకు విద్యాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, మట్టి విగ్రహాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గణేష్ యూత్ అధ్యక్షుడు నీల వెంకటేష్, యూత్ సభ్యులు మాట్లాడుతూ యువతలో మార్పు తీసుకువచ్చేందుకు భక్తి, పూజలతో పాటు విద్యాశక్తి కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో గత పదేండ్లుగా మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గణేష్ యూత్ సభ్యులు పుట్ట భిక్షపతి, కొన్నె సంపత్, పాకనాటి శ్రీనివాస్, దామెర శ్రీనివాస్, నీల సురేష్, కాసర్ల ఉమాకర్, కల్యాణం సత్యనారాయణ, రాములు, అబ్బయ్య, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

విజయ డెయిరీ అధ్యక్షుడికి సన్మానం


ధర్మారెడ్డిని సన్మానిస్తున్న పాలకేంద్రం ప్రతినిధులు

దేవరుప్పుల, సెప్టెంబరు 16: మండలంలోని సీతారాంపురం పాలకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం విజయడైరీ జనగామ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డిని ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ధర్మారెడ్డి మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు తీసుకున్నానని, గత ఇతర రాష్ట్రాల నుంచి పాలు ఎక్కువగా రావటం వల్ల ఇక నుంచి ప్రతీ నెలా బిల్లులు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేష్‌బాబు, మహ్మద్ గులాం రసూల్, బస్వ సోమయ్య, వరికెల రతన్, పుప్పాల భాస్కర్, దుదాటి మైసారావు, జహంగీర్, బస్వ సత్తయ్య, పాలకేంద్రం అధ్యక్షుడు బాషిపాక కొండ య్య, కార్యదర్శి గుడుగుంట్ల భాస్కర్, డైరెక్టర్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ

పాలకుర్తి, సెప్టెంబరు 16 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాల సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో నిర్వ హించే బహిరంగ సభ కరపత్రాలను మండల కేంద్రంలోని వారం తపు సోమవారం సంతలో సీపీఎం నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు రాపర్తి సోమయ్య, చిట్యాల సోమన్న మాట్లాడారు. జనగాంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాచెర్ల సారయ్య, భిక్షపతి, శ్రీకాంత్, సోమయ్య, భీమ్లా, లింగయ్య ఉన్నారు.